ఓపెన్ నాలాలు.. ప్రమాదాలకు నెలవు

- ఎల్లారెడ్డి గూడ, బంజారా హిల్స్‌లో కూలిన రిటైనింగ్ వాల్‌లు
- రక్షణ చర్యలు చేపట్టరు.. కొత్తవి నిర్మించరు
- వర్షం పడితే నాలా అని తెలియని పరిస్థితి



ఎల్లారెడ్డి గూడ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రిటైనింగ్ వాల్ కూలి ప్రమాదకరంగా ఉన్న నాలా



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.13లో ప్రహరీ కూలడంతో ఎటువంటి రక్షణ లేకుండా ఉన్న నాలా

బంజారాహిల్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ నాలాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. వర్షాకాలానికి ముందే నాలాలు ఎంత వరకు సురక్షితం అనే దానిపై జీహెచ్ఎంసీ తనిఖీలు చేపడుతుంది. ఈ సారి తనిఖీలు చేపట్టకపోగా రిటైనింగ్ వాల్‌లు కూలినా కనీసం పట్టించుకునే పరిస్థితి లేకపోవడం బస్తీ వాసులకు శాపంగా మారింది. ముఖ్యంగా సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డి గూడ సమీపంలోని అంబేడ్కర్ నగర్, బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.13లోని అంబేడ్కర్ నగర్‌లో వర్షాకాలానికి ముందే రిటైనింగ్ వాల్‌లు కూలాయి. వాటిని తిరిగి నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రక్షణ లేని ఈ నాలాలు మరింత ప్రమాదకరంగా మారాయి.

ప్రధాన రహదారికి సమీపంలో ఉన్నా..

ఎల్లారెడ్డి గూడ మీదుగా అమీర్‌పేట, బేగంపేట వైపు వెళ్లే నాలాకు అమీర్‌పేట మెట్రోస్టేషన్ వద్ద కల్వర్టు ఉంది. ఈ కల్వర్టు మొదట్లో బీఎస్ఎన్ కార్యాలయం ఎదురుగా మేలో కురిసిన వర్షాలకు రిటైనింగ్ వాల్ కూలింది. ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న నాలా పక్క నుంచి ఉన్న రోడ్డు మీది నుంచి రాకపోకలు కూడా సాగుతుండడంతో రిటైనింగ్ వాల్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో అధికారులు కొత్తది నిర్మించాల్సి ఉండగా ఈ దిశగా చర్యలు తీసుకోకపోగా వాహనాలు నాలాలోకి వెళ్లకుండా అడ్డుగా కర్రలు కట్టారు. తాజా వర్షాల నేపథ్యంలో అమీర్‌పేట మైత్రివనం వద్ద ఈ కల్వర్టు నుంచి వరద నీరు ఎక్కువగా రావడంతో నడుము లోతు నీరు నిలబడ్డాయి. వరద నీటి ప్రవాహానికి కర్రలు కొట్టుకుపోవడంతో వాహనదారులకు కనీసం అక్కడ నాలా ఉంది అనే విషయం కూడా తెలియని పరిస్థితి. వర్షాలు మధ్యలో ఆగినప్పుడు ఇనుప చువ్వలను రక్షణగా పెట్టి అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. దీనికితోడు ఎల్లారెడ్డి గూడ, అంబేడ్కర్ నగర్ మీదుగా అమీర్‌పేట వరకు వెళ్లే దారిలో ప్రైవేట్ హాస్టళ్లు అధికంగా ఉన్నాయి. వీరు నిరుపయోగంగా ఉన్న పరుపులు, ఇతర ఫర్నిచర్‌ను నాలాలో పడేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దాటిన తర్వాత నాలా నీరు సవ్యంగా వెళ్లేందుకు పైపులైన్ ఏర్పాటు చేశారు. ఇది దాటిన తర్వాత ఓ అపార్ట్‌మెంట్ నిర్మాణదారుడు గతంలోనే నాలాపై స్లాబ్ వేసుకున్నాడు. హాస్టల్ నిర్వాహకులు పారేస్తున్న వస్తువులన్నీ కూడా పైప్‌లైన్ మధ్యలోకి వెళ్లి ఆగిపోతుండడంతో వరద నీటి ప్రవాహానికి ఆటంకాలు కలుగుతున్నాయి. గురువారం నాలా ముంపు గురించి తెలుసుకున్న జీహెచ్ఎంసీ పైప్‌లైన్ శుభ్రపరిచే పనిని మొదలు పెట్టింది. హాస్టల్ నిర్వాహకులు పడేసిన పరుపులు, ఇతర వస్తువులను సిబ్బంది తొలగించారు.

ప్రమాదకరం బంజారా నాలా

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10, 13 మీదుగా ప్రవహిస్తున్న నాలా ప్రమాదకరంగా మారింది. గత నెలలో రోడ్డు నెంబర్.13 అంబేడ్కర్ నగర్ లో ఇప్పటికే నాలా ప్రహరీ కూలింది. అధికారులు దానికి రక్షణగా ఇనుప రాడ్లు ఏర్పాటు చేశారు తప్పితే కొత్తది నిర్మించేందుకు చర్యలు తీసుకోలేదు. రిటైనింగ్ వాల్ లేకపోవడంతో వరద నీరు పెద్ద ఎత్తున అంబేడ్కర్ నగర్‌ను ముంచెత్తింది. సమాచారం అందుకున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బస్తీలో పర్యటించారు. రిటైనింగ్ వాల్ విషయంలో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు.

ఎన్ఐపీఎం హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా 'చిక్కాల'



డాక్టర్ వేణుగోపాల్‌రావు

బంజారాహిల్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మానవ వనరుల సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్, వెర్ఫ్ కన్సల్టింగ్ ఎల్ఎల్పీ సీఈఓ డాక్టర్ చిక్కాల వేణుగోపాల్‌రావును ఆ సంస్థ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా నియమించింది. ఆయనకు ఫార్మా, ఐటీ రంగాలలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. వేణుగోపాల్‌రావుకు హ్యూమన్ రీసోర్సెస్, ఇండస్ట్రీయల్ రిలేషన్స్‌లో విస్తృత పరిజ్ఞానం ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ చాప్టర్‌లో సదస్సులు, వర్క్‌షాప్‌లు, కాన్ఫరెన్స్‌లు, జ్ఞాన వేదికల ద్వారా ప్రొఫెషనల్ కమ్యూనిటీని శక్తివంతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



మాతాజీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

మాతాజీనగర్‌లో రోడ్డు పనులను పూర్తి చేయాలి

- కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ మాతాజీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ మహేశ్వరి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అధికారులతో కలిసి మాతాజీనగర్‌లో పర్యటించారు. రహదారి పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు ఆమెకు చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే పనులు పూర్తి చేయిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు టి.శ్రీహరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

పంజాగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపైన ఎక్కడ వేధింపులు జరిగినా చట్ట ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంకల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రోజీ డిమాండ్ చేశారు. సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బాలలపై లైంగిక వేధింపులు-సామాజిక బాధ్యత' కార్యక్రమంలో భా గంగా గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాల రక్షక్ ఫోరంను వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులతో కలిసి ఆమె ప్రారంభించారు. రాష్ట్రంలోని 18 సంవత్సరాలలోపు పిల్లల హక్కులకు భంగం కలిగితే బాల రక్షక్ ఫోరం వెంటనే స్పందించి, బాధితులకు అండగా ఉండడమే కాకుండా వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని డాక్టర్ రోజీ అన్నారు. లైంగిక వేధింపులు అనే అంశం మాట్లాడుకోవద్దన్న అభిప్రాయం చాలామందిలో ఉందని, అది పోవాలని అ న్నారు. ఇటీవల కూకట్‌పల్లిలో దారుణ హత్యకు గురైన బాలికకు నివాళులర్పించారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు హిమబిందు, శ్యామలదేవి, భాగ్యలక్ష్మి, రామలీల, పుష్పలత, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి భాస్కర్ పాల్గొన్నారు.

అద్దె పేరుతో బ్యాంక్ వివరాలు అడిగి మోసం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అద్దెకు ఉంటానని చెప్పి బ్యాంక్ ఖాతా వివరాలు అడిగి నగదు డ్రా చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్, ఇంజనీర్స్ కాలనీ, చైతన్య సాయి రెసిడెన్షియల్‌కి చెందిన కళ్యాణ చక్రవర్తికి వైజాగ్ లో ఇల్లు, ఖాళీ స్థలం ఉంది. కిరాయికి ఇవ్వడానికి 4న తేదీన ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశాడు. 7న తేదీన అద్దెకు తీసుకుంటానని, అడ్వాన్స్ ఇస్తానని దీపక్ అనే వ్యక్తి కళ్యాణ్ చక్రవర్తి బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత గుర్తు తెలియని మరో వ్యక్తి ఫోన్ చేసి యూపీఐ వివరాలు తెలుసుకొని విడతల వారీగా 99,999 నగదును డ్రా చేశాడు. సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో మోసపోయానని తెలుసుకున్న కళ్యాణ్ చక్రవర్తి మధురానగర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు.

బైక్ తీయమన్నందుకు దాడి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దుకాణం ఎదుట బైక్ తీయమన్నందుకు యజమానిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్ నగర్‌కు చెందిన తరంజిత్ సింగ్ చిరువ్యాపారి. సౌజన్య కుమారుడు చాణక్యతో కలిసి షాప్ ముందు ద్విచక్ర వాహనాలు నిలిపారు. కస్టమర్లకు ఇబ్బందిగా ఉండటంతో షాప్ ముందు బైక్ తీయమన్నందుకు బూతులు తిడుతూ సౌజన్య, చాణక్య చెప్పుతో దాడి చేశారని గురువారం తరంజిత్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



ఫుట్‌పాత్‌పై తొలగించిన ఆక్రమణలు

వెస్ట్ శ్రీనివాస నగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

పంజాగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ శ్రీనివాస నగర్ కాలనీలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారులు నిర్వహిస్తున్నారని, దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు కాలనీలో పర్యటించారు. గురువారం హైడ్రా సిబ్బంది అమరావతి హోటల్ సమీపంలోని ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను తొలగించారు. మరో సారి ఫుట్‌పాత్ ఆక్రమించి, ప్రహరీ అనుకుని రేకుల షెడ్లు వేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



హాజరైన పీస్ కమిటీ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, పోలీసులు సమన్వయంతో మెలుగుతూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్ జూబ్లీహిల్స్ ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్ పోలీసుస్టేషన్‌ల పరిధిలోని పీస్ కమిటీలతో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ ఒకే వారంలో వస్తుండడంతో ప్రతీ ఒక్కరు సామరస్యంగా ఉంటూ ప్రశాంత వాతావరణంలో వేడుకలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందుకు వారధిగా పీస్ కమిటీ సభ్యులు వ్యవహరించాలన్నారు. పోలీసుల నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఎవరైనా హద్దు దాటితే సహించేది లేదని హెచ్చరించారు. వినాయక మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మైక్‌లు, డీజేలు పెట్టి చుట్టుపక్కల ప్రాంతాల వారిని ఇబ్బందికి గురిచేయవద్దన్నారు.

మిలాద్-ఉన్-నబీ శోభాయాత్రలో ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా శబ్దాలు చేయవద్దని పేర్కొన్నారు. ఎవరికైనా ఎక్కడైనా ఇబ్బంది కలిగితే డయల్ 100కు గాని, సెక్టార్ ఎస్ఐకు గాని సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సంతోషం, రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడా గణేశ్ ప్రాంగణం వద్ద ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్

ఖైరతాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ బడా గణేశ్ ప్రాంగణాన్ని హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం సందర్శించారు. అక్కడి పరిస్థితులను, జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. నిర్వాహకులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. ఖైరతాబాద్ మెట్రోస్టేషన్, రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సందర్శించారు. బారీకేడింగ్ పాయింట్లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనులను సందర్శించారు. ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు బడా గణేశ్ సందర్శనకు వచ్చే భక్తులను కంట్రోల్ చేయడానికి పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టంను ఏర్పాటు చేయడం, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ-2 శ్రీనివాస్, అదనపు డీసీపీ రాములు, ఏసీపీ మోహన్ కుమార్, సైఫాబాద్ ఏసీపీ సంజయ్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నిబంధనలను పాటించాలని పంజాగుట్ట ఏసీపీ మురళీకృష్ణ సూచించారు. మధురానగర్ సాగి రామకృష్ణారావు కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఆయన నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, ఎస్ఐలు సుష్మ, సాయి కుమార్, భానుచందర్, విద్యుత్ శాఖ అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాలి

ఎర్రగడ్డ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ కల్పతరువు నుంచి పాండురంగ నగర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరగా చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కో-ఆర్డినేటర్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడ్చల్ కలెక్టర్ మను చౌదరికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఎర్రగడ్డ కల్పతరు అపార్ట్‌మెంట్ నుంచి సీటా డెల్ బ్రిగేడ్, బృందావనం అపార్ట్‌మెంట్ల మీదుగా పాండురంగ నగర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వారు పేర్కొన్నారు. కలెక్టర్ మనుచౌదరి, తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



డీఎంసీని కలిసిన మధురానగర్ సంక్షేమ సమితి ప్రతినిధులు

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

వెంగళరావునగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీలో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు ఎన్వీ మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు కోరారు. గురువారం జీహెచ్ఎంసీ సర్కిల్-19 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని పలు రహదారులు దెబ్బతిన్నాయని, కొత్తగా సీసీ రోడ్లు వేయాలని, మిగతా సమస్యలను పరిష్కరించాలని వారు డీఎంసీని కోరారు. వారి వెంట సమితి కోశాధికారి కె.సుగుణ, సంయుక్త కార్యదర్శి హనుమంతరావు, కాలనీవాసులు ఉన్నారు.



బోనాలతో మహిళలు, ఉద్యోగులు

మానసిక ఆస్పత్రిలో ఘనంగా బోనాలు

ఎర్రగడ్డ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోని శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో కాంట్రాక్ట్ శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ ఉద్యోగుల ఇన్‌చార్జి పిట్టల లింగయ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా బోనాల వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ ఆర్ నగర్ ఏసీపీ ఎస్వీరాఘవేందర్ రావు, ఆస్పత్రి ఆర్ఎంవోలు డాక్టర్ శంకర్, డాక్టర్ రమేష్, డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ ఉమేష్, సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపర్తి అశోక్, కార్యదర్శి ఎన్.సైదయ్య, యూనియన్ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ మాదిగ

పంజాగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ విద్య, ఉద్యోగ రంగాల్లోనే జరిగిందని, ఉపాధి, రాజకీయ రంగాల్లో కూడా మాదిగలు ఎదగాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ అధికార ప్రతినిధి దేవని సతీష్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ పార్టీకి మాదిగలు అండగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మాదిగలకు న్యాయం జరిగిందని ఆయన అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ సీనియర్ల మేథోమదన సదస్సు జరిగింది.రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సీనియర్ నాయకులు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగలు అండగా నిలబడాలని సతీష్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన రేవంత్‌రెడ్డిని రాజీనామా చేయాలని మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ పేరుతో అడగడం తప్పు అని అన్నారు. రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పాలించి ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిపోయిన కేసీఆర్‌ను పల్లెత్తు మాట అనకుండా రేవంత్‌రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అప్పుల పాలైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న రేవంత్‌రెడ్డికి అండగా నిలబడేది పోయి బీజేపీ వారికి భజన చేస్తూ కాంగ్రెస్ పార్టీని తిట్టడం, సీఎంను అవమానించడం ఎమ్మార్పీఎస్ నాయకుడు అని చెప్పుకుంటున్న మంద కృష్ణమాదిగకు తగదని పేర్కొన్నారు. దళిత వర్గాలకు న్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీలో ఎమ్మార్పీఎస్ మాదిగ దండోరా ఉద్యమకారులు చేరాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తీర్మానించారు. ఈనెల 31న గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరనున్నట్టు వారు ప్రకటించారు. దళితుల్లో అత్యంత వెనకబడిన కులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బెడ బుడగ జంగాల సంఘం అధ్యక్షుడు చింతల రాజలింగం అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం వ్యవస్థాపక అధ్యక్షురాలు మేరీ మాదిగ, టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ దండోర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.రాంచందర్, బొల్లె సైదులు, ఎమ్మార్పీఎస్ నాయకులు అల్లారం రత్నయ్య, పాలడుగు శ్రీనివాస్, జన్ను జయరాజ్, దండు సురేందర్, జన్ను కనక రాజు మాదిగ, జి.నర్సింహ, నాగారం అంజయ్య, ఎస్. పరమేశ్వర్, శంకర్, గొర్రె రాజయ్య పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇంటర్వ్యూకుకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్, గ్రీన్‌పార్క్ రెసిడెన్షియల్‌కు చెందిన నౌసీన్ అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూడడానికి జవహర్ నగర్‌కు మంగళవారం వచ్చింది. 20న అమీర్‌పేటలో ఉద్యోగం ఇంటర్వ్యూ ఉందని చెప్పి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి నజీమున్నిసాబేగం గురువారం పోలీసులు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులకు ఇళ్లు అందేదెప్పుడు?

ఎదురుచూస్తున్న జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం లబ్ధిదారులు.. వృథా అవుతున్న ప్రజాధనం


చెత్తతో నిండిన జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు


జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల ప్రాజెక్టు బోర్డు


గైదీన్‌బాగ్‌లో శిథిలమవుతున్న జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సొంత గూడు లేని వారికి దశాబ్దం క్రితం ఓ గూడును ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెనెవల్ మిషన్ (జెఎన్ఎన్‌యూఆర్ఎం) పథకం కింద నగరంలో పలు ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించింది. ఆ క్రమంలోనే సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్‌పేట్ డివిజన్ నల్లగుట్టలోని గైదీన్‌బాగ్‌లో ఈ పథకం కింద మొత్తం 48 ఇళ్లను నిర్మించింది. కానీ వాటిని లబ్ధిదారులకు అందజేయకముందే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలైంది. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం చకచకా జరిగిపోయాయి. పేదవారి గుడిసెలు తొలగించి నిర్మించిన ఇళ్లను తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి కేటాయించలేదు. ఏ ముహూర్తాన శంకుస్థాపన చేశారో కానీ అవి పేదలకు అందకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రజా ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇళ్లను నిర్మించి ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. దీంతో గైదీన్‌బాగ్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ఆ ఎదురుచూపులు ఎండమావులుగానే మారుతున్నాయి. శిథిలావస్థకు చేరుకున్న జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లను ఇప్పటికైనా అందజేస్తారా లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

డంపింగ్ యార్డుగా

శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను స్థానికులు డంపింగ్ యార్డుగా మార్చుతున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారిపోయింది. దోమలకు ఆవాసంగా మారడంతో స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా



దశాబ్దం క్రితం నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లు శిథిలావస్థకు చేరుకుని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. రాత్రి అయితే మందుబాబులు, గంజాయి సేవించేవారు ఇక్కడ నానా గొడవలు చేస్తున్నారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి



గతంలో కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద నిర్మించిన ఇళ్లలో 13 మందికి ఇళ్లను కేటాయించాం. ఇంకా 35 ఇళ్లను అందించే సమయానికి ప్రభుత్వం మారిపోవడం జరిగిపోయింది. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూమ్ నిర్మించి ఇస్తామని చెప్పడంతో మిగిలిన లబ్ధిదారులు తమకు డబుల్ బెడ్ రూమ్‌లు కావాలని కోరుకుంటున్నారు. అందువల్ల ఇళ్ల పంపిణీ పెండింగ్‌లో పడింది. ప్రస్తుత ప్రభుత్వం ఏదైనా ఒక నిర్ణయం తీసుకొని సమస్యను పరిష్కరించాలి.

- కోశికే కిరణ్మయి, మాజీ కార్పొరేటర్

ఇళ్లు కేటాయించినా.. మరలా ఆశిస్తున్నారు



17 సంవత్సరాల క్రితం జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల నిర్మాణం ప్రారంభమయ్యింది. ఈ పథకం కింద నిర్మించిన ఇళ్లలో కొన్నింటిని అందించారు. మిగిలిన వాటిని ప్రభుత్వం మారడం వల్ల అందించలేదు. ఇక మిగిలిన వారిలోని కొంతమందికి గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ కేటాయించినప్పటికీ వారు వెళ్లకుండా ఇక్కడ కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆశిస్తున్నారు.

- అబ్బాస్, స్థానికుడు


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

పేదలకు అండ సీఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే

మారేడుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని 31 కుటుంబాలకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, పేద కుటుంబాలు ఆడ పిల్లల పెళ్లిళ్లు చేసి అప్పులపాలు కావద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకం ద్వారా 1,16,000/- రూపాయలను అందిస్తుందని తెలిపారు. సీఎం ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులతో నిరంతరం పర్యవేక్షించి చెక్కుల పంపిణీ ఆలస్యం చూస్తున్నారని అధికారులు కూడా నిబద్ధతతో పనిచేస్తున్నారని తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక


మంత్రి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న రాజేష్‌యాదవ్

సికింద్రాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్ గురువారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబును కలిశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలు వివరించారు. శ్రీగణేష్ నాయకత్వంలో అన్ని వార్డుల్లోని ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామని శ్రీధర్‌బాబుకు వివరించారు. గతంలో ప్రభుత్వ పాలనలో కంటోన్మెంట్‌లో అభివృద్ధి కుంటుపడిందని, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి హయాంలో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. కంటోన్మెంట్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని రాజేష్‌యాదవ్ వెల్లడించారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ కూడా పాల్గొన్నారు.

టీయూజేఏసీ ఆధ్వర్యంలో 12న మహాధర్నా

అడ్డగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారుల సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రొఫెసర్ బాగయ్యలు తెలిపారు. గురువారం తుకారాంగేట్ చౌరస్తాలో సెప్టెంబరు 12న ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, పోరాటం చేసిన ఉద్యమకారులను పాలకులు విమర్శించారన్నారు. ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పెన్షన్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరికి వెళ్లినప్పటికీ ఉద్యమకారులను ఎవరు పట్టించుకోలేదన్నారు. సెప్టెంబరు 12న ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నాకు పెద్ద ఎత్తున అభిమానులు, ఉద్యమకారులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండా యాదగిరి, మోత్కూరి మల్లేశం, ఏలూరు బాబన్న, యాదగిరి, చంద్రకళ, పావని, కమల, యాదగిరి, వెంకటలక్ష్మి, అరుణ, లక్ష్మి, స్వరూపలు పాల్గొన్నారు.


మాతాజీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

మాతాజీనగర్‌లో రోడ్డు పనులను పూర్తి చేయాలి

● కార్పొరేటర్ మహేశ్వరి

బేగంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ మాతాజీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ మహేశ్వరి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అధికారులతో కలిసి మాతాజీనగర్‌లో పర్యటించారు. రహదారి పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు ఆమెకు చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే పనులు పూర్తి చేయిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు టి.శ్రీహరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేయొద్దు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ కేటగిరి-2 ఫలితాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అన్యాయం చేయొద్దని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ఓయూ రిజిస్ట్రార్ నరేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓయూ పీహెచ్‌డీ కేటగిరి-2 నోటిఫికేషన్‌లో డీన్స్ ఫ్యాకల్టీస్(12) ఎస్సీ, ఎస్టీలకు నిర్ణయించిన సీట్ మ్యాట్రిక్స్, ఇంటర్వ్యూ షార్ట్ లిస్ట్ ప్రకారం ఫలితాలు విడుదల చేయాలన్నారు. ప్రస్తుతం ఓయూ అడ్మినిస్ట్రేషన్ అండ్ డీన్ ఫ్యాకల్టీస్ ప్రకారం నాలుగు సీట్లలో ఎస్సీ-1 ఎస్టీ-1 కేటాయించారని, దీని ప్రకారం పీహెచ్‌డీ తుది జాబితాను విడుదల చేయాలని కోరారు. ఈ మధ్యకాలంలో పీహెచ్‌డీ ఫలితాలు, సీట్ మ్యాట్రిక్స్‌పై కమిటీ ఏర్పాటు చేశారని, తమకున్న సమాచారం మేరకు సైన్స్ డీన్ ఆధ్వర్యంలోని కమిటీ ఎస్సీ, ఎస్టీ సీట్లను మార్పులు చేయనున్నారని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారులు.. అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే తలసాని


అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలు జరగకముందే విద్యుత్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని చుట్టాలబస్తీలో పర్యటించారు. ముందుగా నాలా వెంట ఉన్న గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలించారు. వెంటనే గోడ నిర్మాణం పనులు చేపట్టాలని, నాలాలో సిల్ట్ తొలగింపుకు కూడా చర్యలు చేపట్టాలని అధికారులకు చెప్పారు.

బస్తీలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు వరిగిపోయి, శిథిలావస్థకు చేరాయని విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించి నూతనంగా సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ తీగలను కూడా సరిచేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. స్థానిక వ్యాయమశాల వద్ద రోడ్డు సక్రమంగా లేకపోవడం వల్ల నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు విన్నవించగా వెంటనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, ఎస్ఎన్‌డిపి డీఈ సందీప్, ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లికార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు నర్సింగం సతీష్, నాయకులు సతీష్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ధనార్జనకు దోహదపడేలా మార్టిగేజ్ నిబంధన : మన్నె క్రిశాంక్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మన్నె క్రిశాంక్

సికింద్రాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాల అనుమతి విషయమై సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి నూతనంగా ప్రవేశపెట్టిన మార్టిగేజ్ నిబంధన కొందరు రాజకీయ నాయకుల ధనార్జనకు దోహదపడేవిధంగా ఉందని బీఆర్ఎస్ నాయకుడు, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ విమర్శించారు. బీజేపీ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, కాంగ్రెస్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్‌ల సమక్షంలో రూపొందించిన ఈ నిబంధన వల్ల అటు అవినీతి పెరగడంతోపాటు పేదలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని ఆయన పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన సభ్యులు బోర్డు పాలకమండలిలో లేరని, ఈ నేపథ్యంలో కీలకమైన మార్టిగేజ్ నిబంధనను ఎలా అమలులోకి తీసుకువస్తారని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీలో అధికారుల నిబంధనల ప్రకారం అనుమతులు వస్తాయని అన్నారు. అదే పద్ధతిని కంటోన్మెంట్‌లో కూడా అమలు చేయవచ్చు కదా అని ఆయన ప్రశ్నించారు. కంటోన్మెంట్‌లో 111 గజాలకు మించిన స్థలంలో నిర్మాణాలు చేపడితే మార్టిగేజ్ తప్పనిసరి అనే నిబంధనకు అటు బీజేపీ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, కాంగ్రెస్ శాసనసభ్యుడు శ్రీగణేషలు సమర్థించడం విడ్డూరంగా ఉందన్నారు. సీఈఓలు, అధికారులు వస్తుంటారు పోతుంటారని, నిబంధనల రూపకల్పన సమయంలో ఇక్కడి నాయకులకు, ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

స్థల సేకరణను త్వరగా పూర్తి చేయాలి

● హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు

మేడ్చల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి స్థల సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ మేడ్చల్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన స్థల సేకరణ పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థల సేకరణలో భాగంగా స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వారికి నిబంధనల మేరకు పరిహారం చెల్లించాలన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. అల్వాల్‌లోని సత్యా అపార్ట్‌మెంట్ వారికి జరిగే నష్టంపై అంచనా వేయాలని, భూ సేకరణలో భాగంగా శామీర్‌పేటలో తొలగించనున్న సాయిబాబా ఆలయానికి వేరే ప్రాంతంలో స్థలం కేటాయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి చేపట్టిన స్థల సేకరణ వివరాలను కమిషనర్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి, అల్వాల్, శామీర్‌పేట తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌ను కలిసిన బీసీ ఫెడరేషన్ కులాల సమితి సభ్యులు

ఓబీసీ జాబితాల్లో 28 కులాలను చేర్చండి

● బెల్లాపు దుర్గారావు

అడ్డగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీ జాబితాల్లో 28 కులాలను చేర్చాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన కులాలు సారోళ్లు, సోమవంశ క్షత్రియ, బైలు కమ్మరి, గంజికూటి బొందిలి, విష్ణకరణం ఇలా 28 కులాల వెనుకబాటును గుర్తించి కేంద్రం ఓబీసీ జాబితాల్లో చేర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరెద ప్రవీణ్ కుమార్, గోగుల స్వామి, మహిళా అధ్యక్షురాలు కొత్తపల్లి బాయమ్మ, సికింద్రాబాద్ అధ్యక్షుడు బాణాల శ్రీకాంతాచారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.


ఆలయ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

హనుమాన్ ఆలయ నూతన కార్యవర్గం

చిలకలగూడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ హనుమాన్ ఆలయ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ ఎస్.చక్రధరి, సభ్యులుగా హరిబాబు, బ్రహ్మాజీ, క్రాంతి కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆండాలమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు

నిందితులను అరెస్టు చేయాలి

అడ్డగుట్ట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన బీఎస్పీ దళిత నాయకుడు ఈశ్వర్‌పై కొంతమంది దాడి చేశారు. దాడికి పాల్పడ్డ వారిని అరెస్టు చేయాలని బాధితుడు గురువారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గత బోనాల పండుగ సందర్భంగా ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఫ్లెక్సీ వివాదంలో తనపై దాడి చేశారని, ఇంతవరకు దాడి చేసిన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే చైర్మన్ గోపాలపురం ఏసీపీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం


వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

తిరుమలగిరి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని హనుమాన్ దేవాలయం, లలితా త్రిపురా సుందరీ దేవి ఆలయ ప్రాంగణంలో ఈఓ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. వారికి దేవాలయం తరపున ఈఓ లక్ష్మీదేవి ప్రతిమను అందజేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం మహిళలు ఒకరికొకరు పసుపు, కుంకుమలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయం అర్చకులతో పాటు లలితా త్రిపుర సుందరీదేవి ఆలయం నిర్మాణదాత పరుష నిరంజన్, వెంకటరమణలు పాల్గొన్నారు.


సాయిబాబా కాలనీలో నిలిచిన నీరు


గణేష్ నగర్ కాలనీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


సీతారంపురం కాలనీ ప్రధాన రహదారిలో వర్షపు నీరు

రహదారులపైనే వర్షపు నీరు

ఇబ్బందుల్లో పాదచారులు, వాహనదారులు


వాణీ కాన్వెంట్ స్కూల్ వద్ద నిలిచిన నీరు

బోయినపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని ఆరో వార్డు పరిధిలోని కొన్ని కాలనీల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడం, డ్రైనేజీ సమస్యలు తలెత్తడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బోయినపల్లి సీతారాంపురం, సాయిబాబా కాలనీ, గణేష్‌నగర్, వాణీ కాన్వెంట్ కాలనీలోని ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్ల పైకి వచ్చి చేరుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులను పాఠశాలలకు తీసుకువెళ్తున్న క్రమంలో తల్లిదండ్రులు పడుతున్న తిప్పలు అన్నీ ఇన్నీ కావు. నిలిచిన వర్షపునీటిలో గుంతలు కనిపించకపోవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


చర్యలు తీసుకోవాలి



రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా పారిశుధ్యం అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రజలకు ఇబ్బందులు రాకుండా కంటోన్మెంట్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలి.

- శంకరయ్య, స్థానికుడు

చెత్తాచెదారాన్ని తొలగించాలి



వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో ప్రధాన జంక్షన్ల వద్ద చెత్తా చెదారాన్ని తొలగించి, డ్రైనేజీల్లో నీరు వెళ్లేలా చూడాలన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

- గోపాల్ గౌడ్, స్థానికుడు